

బధిరులకు ఉపాధి కల్పించేలా చర్యలు

కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం

బధిరులకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వివిధ పరిశ్రమల ప్రతినిధులు, జిల్లా పరిశ్రమల అధికారి, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారులతో సమావేశమై బధిరులకు (మూగ, చెవిటి) ఉపాధి కల్పించడంపై సమీక్షించారు. ఇటీవల బధిరులు నన్ను కలిసి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ రిప్రజెంటేషన్ అందజేయడం జరిగిందన్నారు. వీరికి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు, జిల్లా కలెక్టరేట్ పరిపాలన అధికారి పి.పాపారావు, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజరు ఎ.నాగేంద్ర ప్రసాద్, పిసిబి ఎఇ ఎస్.రమేష్ పాల్గొన్నారు.



భీమవరంలో నిరసన తెలియజేస్తున్న నేతలు



తాడేపల్లిగూడెంలో నినదిస్తున్న కార్మికులు

అన్నం పెట్టే రైతుల పట్ల నిర్లక్ష్యం తగదు

వచ్చే ఎన్నికల్లో మోడీ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు - ధర్నాల్లో రైతు, కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి - భీమవరం

దేశ ప్రజలకు అన్నం పెడుతున్న రైతుల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించడం తగదని, రానున్న ఎన్నికల్లో మోడీ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ చలో ఢిల్లీ కార్యక్రమానికి మద్దతుగా రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశం చౌక్‌లో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బాబూరావు, గోపాలన్, అఖిలభారత కిసాన్ సభ అగ్రగామిక రాష్ట్ర అధ్యక్షులు లంకా కృష్ణమూర్తి, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జుత్తిగ నరసింహామూర్తి మాట్లాడారు. ఇప్పటికైనా రైతు, కార్మికుల డిమాండ్లు పరిష్కరించకపోతే రానున్న ఎన్నికల్లో వారి ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, ఉపాధి హామీకి బడ్జెట్లో నిధులు పెంచి పని దినాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు డి.కళ్యాణి, లారెన్స్‌కుమారి, ఎం.ఆంజనేయులు, గొర్ల రామకృష్ణ, ఇంజేటి శ్రీనివాస్, దండు శ్రీనివాసరాజు, ఎం.వైకుంఠరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, వడుగు వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు, యాళ్లబండి నారాయణమూర్తి, తాళ్లూరి రాము, పాలా కోటేశ్వరరావు, సుభాకర్ పాల్గొన్నారు.



తణుకులో నినదిస్తున్న నేతలు

తణుకు రూరల్: స్థానిక నరేంద్ర సెంటర్‌లో చలో ఢిల్లీకి మద్దతుగా నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు అడ్డగర్ల అజయకుమారి, పి.దక్షిణామూర్తి, పిఎల్.నర్సింహారావు, గార రంగారావు, గుబ్బల గోపీ, కె.నర్సింహారావు, ఎన్.చిన్నారావు, బ్రహ్మాజీ, కిషోర్, సాయిబాబు, పెంటయ్య, వి.రాము, జి.గోవిందరావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: స్థానిక పోలీసు ఐల్యాండ్ వద్ద సిఐటియు ఆధ్వర్యాన చలో ఢిల్లీకి సంఘీభావ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో జవ్వాది శ్రీను, మేట్రెడ్డి రమణ, శిద్దిరెడ్డి శేషుబాబు, బొడబొళ్ల లక్ష్మీనారాయణ, తంగేటి శ్రీనువాసు, యడవల్లి వెంకట దుర్గారావు, పతివాడ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

పెంటపాడు: పెంటపాడులో నిరసన చేపట్టారు. కార్యక్రమానుద్దేశించి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ల పుల్లారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మాదాసు శ్రీను, తాడి సుబ్బయ్య, గాది వెంకట్రావు, వీరభత్తుల దానయ్య, వీరభత్తుల పుల్లయ్య, రాము, జక్కంపూడి పెంటారావు, వి.నాగేశ్వరరావు, తాడి అంజి, ప్రసాద్, హేమసాయి, సూర్‌రెడ్డి పాల్గొన్నారు.

నరసాపురం: రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేకి మోడీ, బిజెపి పాలనను ప్రజలంతా వ్యతిరేకించాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కవురు పెద్దిరాజు అన్నారు. స్థానిక అంబేద్కర్ సెంటర్లో నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎం.త్రిమూర్తులు, జె.రామ్మోహనరావు, పి.నారాయణరావు, జి.శ్రీరామమూర్తి, జి.ధనలక్ష్మి, పి.రాము, ఎన్.కొండ పాల్గొన్నారు.

ఆచంట: పెనుమంట్ర మండలం బ్రాహ్మణ చెరువు సెంటర్లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరామ్ మాట్లాడగా కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు, గంటి ఆంజనేయులు, చింతపల్లి అప్పారావు, కముజు వెంకటేశ్వర్లు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఆకివీడు: స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో సిఐటియు ఆధ్వర్యాన సంఘీభావ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి కె.తవిటినాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో షేక్ వలీ, బి.రాంబాబు, కార్మికులు పాల్గొన్నారు.

ఉత్కంఠకు తెర..!

- పిఠాపురం బరిలోనే పవన్‌కళ్యాణ్
- ఎట్టకేలకు స్పష్టతిచ్చిన జనసేనాని
- ఉమ్మడి జిల్లాలో నాలుగు స్థానాల్లో జనసేన అభ్యర్థులు ఖరారు
- 'పోలవరం'పై వీడని ఉత్కంఠ: టిడిపికే సీటు అని ప్రచారం



ప్రజాశక్తి - భీమవరం

జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ ఎక్కడ నుంచి పోటీ చేస్తారనే అంశంపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. వచ్చే ఎన్నికల్లో పిఠాపురం నుంచి పోటీ చేస్తున్నట్లు ప్రకటించడంతో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రకటించడంతో ఇప్పటి వరకూ సాగిన ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పడింది. 2019 ఎన్నికల్లో భీమవరం నుంచి పోటీ చేసిన పవన్‌కళ్యాణ్ స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఈ నేపథ్యంలో పోయిన చోటే వెతుక్కోవాలనే నానుడికి అనుగుణంగా ఈసారి ఎన్నికల్లో భీమవరం నుంచే పోటీ చేయాలని పవన్ నిర్ణయం తీసుకున్నట్లు మొదట్లో ప్రచారం సాగింది. దీనిలో భాగంగానే ఇటీవల భీమవరంలో పర్యటించిన పవన్ టిడిపి, జనసేన, బిజెపి ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. దీంతో పవన్ భీమవరం నుంచే పోటీ చేస్తారని అంతా భావించారు. రాష్ట్రవ్యాప్తంగా భీమవరం నుంచే పవన్ పోటీ చేస్తున్నట్లు ప్రచారం కూడా సాగింది. అయితే మారిన సమీకరణల నేపథ్యంలో మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు జనసేనలో చేరారు. ఒకరోజు వ్యవధిలోనే రామాంజనేయులుకు జనసేన టిక్కెట్‌ను పవన్ కేటాయించి ప్రకటించారు. దీంతో భీమవరం నుంచి పవన్ పోటీ చేయట్లేదని స్పష్టమైంది. ఇక తిరుపతి, పిఠాపురం, గాజువాక స్థానాల్లో ఏదోక చోట నుంచి పోటీ చేస్తారనే ప్రచారం సాగింది. మరోపక్క ఎంపీగా సైతం పోటీ చేస్తారని విస్తృత ప్రచారం సాగింది. ఈ నేపథ్యంలో ఈ ప్రచారాలన్నింటికీ పవన్ ఫుల్‌స్టాప్ పెట్టారు. మంగళగిరిలో జరిగిన జనసేన 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో తాను కాకినాడ జిల్లా పిఠాపురం నుంచి పోటీ చేస్తున్నట్లు పవన్ ప్రకటించారు. పిఠాపురం నియోజకవర్గంలో కాపు సామాజిక తరగతి ఓట్లు దాదాపు 91 వేలు ఉండడంతో పవన్ భారీ విజయానికి ఢోకా ఉండదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఇక ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు స్థానాల నుంచి జనసేన పోటీ చేస్తున్నట్లు స్పష్టత వచ్చింది. ఆయా స్థానాల అభ్యర్థులను పవన్ ఖరారు చేయడమే దీనికి నిదర్శనం. అయితే పోలవరం సీటు విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. బిజెపితో పొత్తు నేపథ్యంలో జనసేన మూడు అసెంబ్లీ సీట్లు వదులుకోవాల్సి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలవరం సీటును జనసేన టిడిపికే వదిలేస్తుందనే ప్రచారం సాగుతోంది. ప్రధానంగా జనసేనకు బలమైన అభ్యర్థి లేకపోవడం, టిడిపి నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడం, పొత్తు పరిణామాల నేపథ్యంలో జనసేనాని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారనే ప్రచారం సాగుతోంది. అయితే దీనిపై అటు టిడిపి, లేదా ఇటు జనసేన నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. పోలవరం సీటు టిడిపికి వదిలేస్తే జనసేన నాలుగు సీట్లకే పరిమితమైనట్లు. కైకలూరు సీటు బిజెపికి కేటాయించినట్లు తెలుస్తోంది. మొత్తంగా పరిశీలిస్తే తాజాగా ప్రకటించిన దెందులూరు అభ్యర్థి చింతమనేని ప్రభాకర్‌తో కలిపి టిడిపి ఎనిమిది మంది అభ్యర్థులను ప్రకటించగా, జనసేన నలుగురు అభ్యర్థులను ఖరారు చేసింది. కైకలూరు, పోలవరం సీట్ల నుంచి ఎవరు బరిలోకి దిగుతారనేది తెలియాల్సి ఉంది.

రూ.19.54 కోట్లు ఇబిసి నేస్తం సొమ్ము జమ

కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

అగ్రవర్ణాల పేద మహిళలకు ఆర్థిక వరం ఇబిసి నేస్తమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. జిల్లాలో మూడో విడత ఇబిసి నేస్తం పథకంలో 13,024 అగ్రవర్ణ పేద మహిళలకు రూ.19.54 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసినట్లు తెలిపారు. సిఎం జగన్ ఇబిసి నేస్తం నగదు జమను బటన్ నొక్కి ప్రారంభించిన అనంతరం స్థానిక కలెక్టరేట్లో కలెక్టర్ సుమిత్ కుమార్, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. కార్యక్రమంలో బిసి కార్పొరేషన్ ఎఇఒ కె.ప్రమీలారాణి, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పట్నాల గౌరి, కన్వీనర్ పట్నాల గణపతి, రాష్ట్ర గౌరవ సలహాదారులు వడ్లాది కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు మాన్యువల్ చెక్కును అందిస్తున్న జిల్లా కలెక్టర్

ఎంఎల్‌ఎగా గెలిచి రుణం తీర్చుకుంటా

జనసేన భీమవరం అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు

ప్రజాశక్తి - భీమవరం

జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు రుణపడి ఉన్నానని, రాబోయే ఎన్నికల్లో ఎంఎల్‌ఎగా గెలిచి కానుకగా ఇచ్చి పవన్ రుణం తీర్చుకుంటానని భీమవరం జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం జనసేన స్థానాన్ని అంజిబాబుకు ప్రకటించిన నేపథ్యంలో స్థానిక అల్లూరి సీతారామరాజు కళ్యాణ మండపంలో గురువారం పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమవరం నియోజకవర్గ పరిధిలోని రెండు మండలాలతోపాటు పట్టణంలోని జనసేన శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు, వీర మహిళలు భారీగా తరలివచ్చి అంజిబాబుకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడారు మెరుగైన సమాజం కోసం జనసేన స్థాపించడం జరిగిందన్నారు. ఇటువంటి పార్టీలో చేరడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తనను ఎంఎల్ఎ అభ్యర్థిగా ప్రకటించినందుకు తాను ఎప్పుడూ పవన్‌కళ్యాణ్‌కు రుణపడి ఉంటా నన్నారు. జనసేన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు కోటికలపూడి గోవిందరావు (చినబాబు) నాయకత్వంలో ముందుకు సాగుతానన్నారు. భీమవరం ఎంఎల్ఎ గ్రంధి మతిస్థిమితం లేక మాట్లాడుతున్నారన్నారు. జనసేన నాయకులందరూ తనను స్వాగతిస్తున్నారన్నారు.



అంజిబాబును అభినందిస్తున్న కార్యకర్తలు, నేతలు

ఘనంగా జనసేన 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుక

స్థానిక పార్టీ కార్యాలయంలో జనసేన 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గురువారం పార్టీ శ్రేణులు, వీర మహిళలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానుల నడుమ ఘనంగా జరిగింది. జనసేన ఉమ్మడి ఎంఎల్ఎ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు కోటికలపూడి గోవిందరావు (చినబాబు) పిఎసి సభ్యులు కనకరాజు సూరి, జిల్లా ప్రధాన కార్యదర్శి చెనుమల్ల చంద్రశేఖర్ పార్టీ జెండాను ఆవిష్కరించి భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా చిన్నబాబు మాట్లాడారు. భీమవరంలో రాబోయే ఎన్నికల్లో జనసేన జెండా ఎగురవేస్తామని చెప్పారు. గ్రంధి శ్రీనివాస్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలన్నారు. కార్యక్రమాల్లో వీరవాసరం జెడ్‌పిటిసి సభ్యులు గుండ జయప్రకాశ్ నాయుడు, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

డిఎంహెచ్ఒ మహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా ప్రోత్సహించినా చట్ట రీత్యా నేరమని, అటువంటి సెంటర్లను సీజ్ చేసి క్రిమినల్ కేసులు పెట్టడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, లింగ నిర్ధారణ నిరోధక చట్టం జిల్లా కమిటీ ఛైర్మన్ డాక్టర్ డి.మహేశ్వరరావు అన్నారు. స్థానిక కలెక్టరేట్లో గురువారం లింగ నిర్ధారణ నిరోధక చట్టం అమలు తీరుపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడుతూ లింగ నిర్ధారణ చేస్తే సంబంధిత సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 9 స్కానింగ్ సెంటర్ల పునరుద్ధరణ, 7 స్కానింగ్ సెంటర్లలో మార్పులు, 4 కొత్త రిజిస్ట్రేషన్ల ప్రక్రియపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో కమిటీ ఛైర్మన్ డాక్టర్ బి.భానునాయక్, కమిటీ కన్వీనర్ డిఐఒ డాక్టర్ డి.సుధాలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం

ఇద్దరిపై కేసు నమోదు

ప్రజాశక్తి - భీమవరం

బాలికపై అత్యాచారం ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గునుపూడికి చెందిన బాలిక (14)పై అదే ప్రాంతానికి చెందిన నల్లిగొంగుల అనిల్ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ బాలిక గర్భందాల్చడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం ఆ బాలిక 9 నెలల గర్భిణి. బాలికను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లడంతో గర్భిణి అని తేలిందని, దీంతో బాలికను నిలదీగా అనిల్ అత్యాచారానికి పాల్పడిన విషయం వెల్లడించిందని బాలిక తల్లి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అనిల్‌పైనా, బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన పోతుల బాబురావుపైనా కేసు నమోదు చేసినట్లు సిఐ అడబాల శ్రీనివాస్ తెలిపారు.

దెందులూరు టిక్కెట్ చింతమనేనికే

ప్రజాశక్తి - ఏలూరు టౌన్



టిడిపి దెందులూరు నియోజకవర్గ అభ్యర్థిగా చింతమనేని ప్రభాకర్ పేరు ఖరారైంది. ఈ మేరకు ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు బుధవారం చింతమనేనికి ఫోన్ చేసి ఖరారు చేయడంతోపాటు గురువారం ప్రకటించిన రెండో జాబితాలో ఆయన పేరు ఉండటంతో సస్పెన్స్‌కు తెరపడింది. దీంతో నియోజకవర్గంలోని టిడిపి శ్రేణులు, ఆయన అభిమానులు సంబరాలు చేసుకున్నారు. మొదటి నుంచి చింతమనేనికి టిడిపి టిక్కెట్ దక్కుతుందో, లేదో అనే అనుమానాలు వెల్లువెత్తాయి. చింతమనేనికి బదులు ఆయన కుమార్తెకు, భార్యకు టిక్కెట్ ఇస్తారనే ప్రచారం సాగింది. అయితే టికెట్ తనకే ఇస్తారని, తన కుటుంబ సభ్యులకు పోటీ చేసే ఆసక్తి లేదని స్వయంగా చింతమనేని ప్రకటించాల్సి వచ్చింది. ఈడ్పుగంటి సహా పలువురు అధినేత చంద్రబాబును కలిసి తమకు సీటు కేటాయించాలని కోరారు. సినీ నటుడు మురళీమోహన్ కుమార్తెకు, మాజీ ఎంపీ మాగంటి బాబుకు టిక్కెట్ ఇస్తున్నారనే ప్రచారం జోరుగా సాగింది. దీంతో చింతమనేని అభ్యర్థిత్వంపై పలు అనుమానాలు నెలకొన్నాయి. అయితే చంద్రబాబు ప్రకటనతో అనుమానాలన్నీ పటాపంచలయ్యాయి.

వైసిపి గూటికి ఈలి నాని

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మాజీ ఎంఎల్ఎ ఈలి వెంకట మధుసూదనరావు (నాని) వైసిపి గూటికి చేరారు. గురువారం సిఎం నివాసంలో జగన్ సమక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జగన్ నానికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈయన 2009లో తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుండి ప్రజారాజ్యం పార్టీ నుంచి ఎంఎల్‌ఎగా గెలిచారు. 2019 ఎన్నికల్లో టిడిపి నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. నాని తాడేపల్లిగూడెం వైసిపి టిక్కెట్ కోసం ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.



ఈలి నానిని పార్టీకిలోకి ఆహ్వానిస్తున్న సిఎం

సొంతింటి కల నెరవేర్చిన ఘనత జగన్‌దే

ప్రజాశక్తి - ఉండి

పేదల సొంతింటి కల నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. అర్తమూరులో గురువారం గ్రామ సర్పంచి గోనబోయిన వీర్రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ కార్యక్రమంలో పివిఎల్ పాల్గొని మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించి ఉచితంగా ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీహరి నారాయణరాజు, గులిపల్లి అచ్చారావు పాల్గొన్నారు.

పాలకొల్లును ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా


ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

రానున్న ఎన్నికల్లో తనను మూడోసారి ఎంఎల్‌ఎగా గెలిపిస్తే రాష్ట్రంలోనే పాలకొల్లును ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని పాలకొల్లు ఎంఎల్ఎ, టిడిపి అభ్యర్థి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆయన ప్రజాశక్తి బృందంతో మాట్లాడారు.

ప్రశ్న: పాలకొల్లులో గతంలో రెండుసార్లు ఎంఎల్‌ఎగా ఎన్నికయ్యారు. మీరు సంతృప్తిగా చేసిన పనులు ఏమిటి?

నియోజకవర్గంలో గూడు, నీడ లేని పేదలకు ఎన్‌టిఆర్ టిడ్కో గృహాలను నిర్మించాను. 90 శాతం నిర్మాణం పూర్తయ్యింది. టిడిపి హయాంలో 1,856 ఇళ్లకు గృహ ప్రవేశం చేసేందుకు తాళాలు కూడా ఇచ్చాం. ప్రభుత్వం మారడంతో వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో రూపాయి పని కూడా చేయలేదు. పైగా టిడిపి వేసిన రంగులు మార్చి వైసిపి రంగులు వేసుకుంది. పట్టణంలో శ్మశానవాటిక అధ్వానంగా ఉండేది. దీన్ని కైలాసవనంగా అద్భుతంగా తీర్చిదిద్దాను. యడ్ల బజార్‌లోని శంభునిచెరువును, రామగుండం పార్కును సుందరంగా తీర్చిదిద్దాను. పట్టణ ప్రభుత్వాసుపత్రిలో 50 పడకలు ఉండగా దీన్ని రూ.12.5 కోట్లతో వంద పడకల ఆసుపత్రిగా నిధులు మంజూరు చేయించి తీసుకొచ్చాం. ప్రభుత్వం మారడంతో దీని నిర్మాణం నామమాత్రంగా జరుగుతోంది. విజ్జేశ్వరం నుంచి నేరుగా పైపులైన్ ద్వారా పాలకొల్లుకు తాగునీరందించేందుకు రూ.200 కోట్ల నిధులు మంజూరు చేయించాను. పట్టణంలో దమయపత్రి డ్రెయిన్‌కు రూ.6 కోట్లు మంజూరు చేయించాం. నియోజకవర్గంలో రైతులు పుంత రోడ్లు లేక ఇబ్బంది పడడంతో రూ.16 కోట్లు మంజూరు చేయించి గ్రావెల్ రోడ్లు వేయించాను. తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా రూ.15 కోట్లతో రెండు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టి 90 శాతం పనిపూర్తి చేశాం. పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉండడంతో రూ.10 కోట్లతో గాంధీ బొమ్మ సెంటర్ నుంచి యడ్ల బజార్ వరకూ రోడ్డును విస్తరించాం. వెలమగూడెం - శ్రీనివాస్ థియేటర్ - మార్కెట్ రోడ్డును వెడల్పు చేసి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చేశాం.



ప్రశ్న: నియోజకవర్గానికి ఇంకా ఏం చేయాలనుకుంటున్నారు?

పాలకొల్లు నుంచి తిరిగి ఎన్నికైతే 220 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణాన్ని పూర్తిచేసి నియోజకవర్గంలో విద్యుత్ కోతలు లేకుండా చేస్తాం.

ప్రశ్న: ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం సహకరించకపోయినా ఎంపీ నిధులతో కొన్ని పనులు చేశారని చెబుతున్నారు. నిజమేనా?

రాష్ట్రంలో టిడిపి అధికారంలో లేకపోయినా కనకమేడల రవీంద్ర, కనుమూరి రఘురామ కృష్ణంరాజు వంటి కొందరు ఎంపీల సహాయంతో నియోజకవర్గంలో దాదాపు నాలుగు కోట్ల రూపాయలకుపైగా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేయించాం. ముఖ్యంగా ఎస్‌సి, బిసి కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు అత్యధిక ప్రాధాన్యతిచ్చాం.

ప్రశ్న: వచ్చే ఎన్నికల్లో మీరు గెలిచి, టిడిపి కూటమి అధికారంలోకొస్తే మీకు మంత్రి పదవి వస్తుందని ప్రచారం ఉంది. ఇదే జరిగితే మీరు పాలకొల్లుకు చేసే శాశ్వత ప్రాజెక్టులు ఏమిటి?

వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి విజయం సాధించాక రాష్ట్రంలో పాలకొల్లు నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలబెడతా. ధవళేశ్వరం నుంచి పాలకొల్లుకు తాగునీటి పైపులైను ఏర్పాటు చేసి వేసవిలో కూడా పాలకొల్లులో ఎటువంటి తాగునీటి సమస్య లేకుండా పరిష్కరిస్తాం. ఆక్వాకల్చర్ అభివృద్ధికి పాలకొల్లు కేంద్రంగా చర్యలు తీసుకుంటాం. విద్యార్థులు, కార్మికులు వలస పోకుండా పాలకొల్లులో పరిశ్రమల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. పాలకొల్లు నుండి దేశంలోని ప్రధాన నగరాలకు రైళ్లు వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. నత్తనడకన సాగుతున్న దగ్గులూరు వైద్యశాల వేగంగా నిర్మిస్తాం. చేనేత కార్మికుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : పాలకొల్లులో జనసేన సహకారం ఎలా ఉంది?

పాలకొల్లు నియోజకవర్గంలో జనసేన, బిజెపి సహకారం పూర్తిగా ఉంది. రెండు నెలలుగా ఏ గ్రామంలో టిడిపి ప్రచారం చేసినా జనసేన నేతలు, కార్యకర్తలు పూర్తిగా సహకరిస్తున్నారు. దీంతో ప్రతిపక్ష వైసిపి నేతలు బెంబేలెత్తుతున్నారు. ఇప్పుడు బిజెపి కూడా కలవడంతో మా మెజార్టీ మరింత పెరుగుతుందని వైసిపి నేతలు కంగారుపడుతున్నారు.

ఉద్యోగుల గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం

స్థానిక కలెక్టరేట్లో ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్‌ను ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రీవెన్స్ సెల్‌కు వెళ్లే ఉద్యోగులకు, అధికారులు తప్పనిసరిగా అనుమతులు ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఏమైనా సమస్యలుంటే గ్రీవెన్స్ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. దరఖాస్తుతోపాటు సిఎఫ్‌ఎం ఎస్ఐడి, ఎంప్లాయ్ గుర్తింపు ఐడి నెంబరు, ఆధారు కార్డు, సెల్ నంబర్‌తో గ్రీవెన్స్‌కు హాజరు కావాలని తెలిపారు.

గ్రూప్ -1 పరీక్షల నిర్వహణలో భారీ కుంభకోణం

టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం

నిరుద్యోగులకు ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్ గ్రూప్-1 పరీక్షల నిర్వహణలో భారీ కుంభకోణం చేశారని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడారు. టిడిపి ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశంతో 2018లో గ్రూపు-1 నోటిఫికేషన్ విడుదల చేశారని, ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన జగన్ నిబంధనలను తుంగలో తొక్కారన్నారు. గ్రూప్ -1 పరీక్షల నిర్వహణలో ప్రశ్నాపత్రాల మూల్యాంకణ పలుమార్లు చేయడంతో రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం గ్రూప్-1 పరీక్షలను రద్దు చేసిందన్నారు. ఇది జగన్ సర్కారుకు చెంపపెట్టన్నారు. ఈ కుంభకోణంలో వైసిపి పెద్దల పాత్ర ఉందని విమర్శించారు.

బిసి, ఎస్‌సిలకే ప్రాధాన్యం : నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

బిసి, ఎస్‌సిలకే అధిక ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తున్నానని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. ఆగర్రుపాలెం గ్రామంలో శెట్టిబలిజ కాలనీ రామాలయం వద్ద ఎంపీ నిధులు రూ.15 లక్షలతో నిర్మించిన బిసి సామాజిక భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మరో నెల రోజుల్లో అధికారంలోకి రాబోయే టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వంలో భవన పై అంతస్తుకు మరో రూ.50 లక్షలు తీసుకొస్తానన్నారు. పూలపల్లిలో గౌడ శెట్టిబలిజ సామాజిక భవన నిర్మాణానికి రూ.1.50 కోట్లు నిధులు తీసుకొచ్చానన్నారు. అధికారంలోకి రాబోయే టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వంలో గ్రామస్తులకు సురక్షిత తాగునీరు అందేలా చూసే బాధ్యత తనదేనని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి కావలి వెంకటలక్ష్మి కుమారి, నున్నస్వామి సత్యనారాయణ, మేడిది జాన్ రాజ్, ఆబెల్ రాజు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

ప్రజాశక్తి - ఆచంట

ప్రభుత్వం ఇచ్చిన భూమిని భారత దేశంలోనే దస్తావేజు రూపంలో ఇచ్చిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందని ఎంఎల్‌ఎ రంగనాథరాజు అన్నారు. పెనుమంట్ర, గరువు గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా గరువు గ్రామంలో సిసి రోడ్లకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని పెనుగొండ, పెనుమంట్ర మండలాలకు చెందిన ఇంటిటిటి నవరత్నాలు కార్యక్రమంలో భాగంగా, జగనన్న ఇళ్ల కాలనీకి చెందిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అందరికీ సొంత ఇల్లు ఉండాలన్న ఉద్దేశంతో ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు వాటిని లబ్ధిదారుల పేరుపైనే రిజిస్ట్రేషన్ చేసి జగనన్న ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైసిపి శ్రేణులు, అధికారులు పాల్గొన్నారు.

పాలకోడేరు : జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసి, యాజమాన్య హక్కులు కల్పించడం రాష్ట్ర చరిత్రలోనే విప్లవాత్మకమైన చర్య అని శృంగవృక్షం సర్పంచి జంగం సూరిబాబు అన్నారు. గురువారం ఆయన పంచాయతీ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉపసర్పంచి కలిదిండి ఆనందరాజ్, ఎంపిటిసి సొడదాసి నరేష్, వార్డు సభ్యులు సోము దుర్గా భవాని పాల్గొన్నారు.

నెలాఖరులోగా పన్నులు వసూలు చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి - నరసాపురం

ఈనెలాఖరులోగా నూరుశాతం పన్నులు వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఛాంబర్‌లో ప్లానింగ్ సెక్రటరీ, అడ్మిన్ సెక్రటరీ, నోడల్ ఆఫీసర్లతో రివ్యూ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పురపాలక సంఘం పరిధిలోని ఇంటి, ఖాళీ స్థలాలు, తాగు నీటి కుళాయి పన్నులు చెల్లింపునకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 2023-24 వరకు ఉన్న పన్ను బకాయిలు ఏక మొత్తంగా చెల్లిస్తే అపరాధ రుసుం లేకుండా (వడ్డీ లేకుండా) చెల్లించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వికలాంగులకు ట్రై సైకిళ్లు అందజేత

ప్రజాశక్తి - ఉండి

ఉత్తమ సమాజ నిర్మాణానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ధ్యేయమని మానవత జిల్లా అధ్యక్షులు తాడేపల్లి మోహన్‌రావు అన్నారు. గురువారం ఆరేడులో వికలాంగులకు మూడు ట్రై సైకిళ్లను సంస్థ మండల అధ్యక్షులు కట్రెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు తాడేపల్లి మోహన్ రావు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి చేయూతనిస్తూ ఉత్తమ సమాజ నిర్మాణానికి మానవత తోడ్పాటు నిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆత్మీయ సహకార కమిటీ ఛైర్మన్ సాగిరాజు జానకిరామరాజు, రుద్రరాజు సూర్యనారాయణ రాజు, మండల కో ఛైర్మన్ దంగేటి రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా పుడతారని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. గురువారం కాళీపట్నం సెక్టార్‌లో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అవగాహన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎం.పద్మ, ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

'బిసిలంతా టిడిపివైపు ఉండాలి'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలో బిసి గౌడ శెట్టిబలిజ నాయకులతో పాలకొల్లు మండల అధ్యక్షులు కోడి విజయభాస్కర్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బిసిలంతా తెలుగుదేశం వైపు ఉండాలని అన్నారు. బిసిలంటే టిడిపి అని, టిడిపి అంటే బిసి తెలిపారు. ఈ కార్యక్రమంలో పెచ్చెట్టి చంద్రమౌళి, దొమ్మేటి ఏసు, కేతా రాజు, కట్ట మురళీ పాల్గొన్నారు.

ఛాంబర్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పాలకొల్లు

ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం విడుదల చేసిన 3వ సెమిస్టర్ ఫలితాల్లో గురువారం ఛాంబర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు 86 శాతం ఉత్తీర్ణత సాధించారని కళాశాల ఛైర్మన్ కెవిఆర్ నరసింహారావు తెలిపారు. నన్నయ్య విశ్వవిద్యాలయం పరిధిలో 86 శాతం ఉత్తీర్ణత సాధించిన కళాశాలలు అతి తక్కువ అని, ఉత్తమ ఫలితాల సాధనలో ఛాంబర్స్ కళాశాల తన విజయకేతనాన్ని ఎగురవేస్తోందని అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ గ్రేడ్ పాయింట్స్ సాధించిన విద్యార్థులను, ప్రిన్సిపల్ డి. వెంకటేశ్వరరావు, అధ్యాపకులు అభినందించారు.

కిడ్నీ బాధితులకు లయన్స్ చేయూత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వరల్డ్ కిడ్నీ డేను పురస్కరించుకొని తాడేపల్లిగూడెం స్పిరిట్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఏరియా హాస్పటల్ డయాలసిస్ సెంటర్ వద్ద సేవా కార్యక్రమం జిల్లా క్యాబ్ నేట్ సెక్రటరీ లయన్ నూకల నాగ మల్లేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా జిల్లా గవర్నర్ లయన్ గట్టిం మాణిక్యాల రావు, జిల్లా అడ్వయిజర్, లయన్ పదం కుమార్ గుప్తా, జోన్ ఛైర్‌పర్సన్ లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు. అనంతరం డయాలిసిస్ బాధితులకు బ్రెడ్స్ అందించారు. ఈ కార్యక్రమంలో లయన్ బత్తుల ప్రసాద్, క్లబ్ కార్యదర్శి లయన్ రంజిత్, లయన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

వినియోగదారులు కొనుగోళ్లలో జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఆకివీడు

వినియోగదారులారా మేల్కొనండి అంటూ వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు జిల్లా అధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య పిలుపునిచ్చారు. ఈనెల 15వ తేదీ శుక్రవారం ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా బంగారయ్య వినియోగదారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రతి వస్తువులో కల్తీ పెరిగిపోయిందని, వినియోగదారులు తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

.రూ.73.43 కోట్లతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు

మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

భవిష్యత్తులో మరో 50 ఏళ్లు తాడేపల్లిగూడెం పట్టణ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేవిధంగా రూ.73.43 కోట్ల అంచనా వ్యయంతో సెకండ్ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పనులు చేపడుతున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. 54 ఎకరాల్లో 980 మిలియన్ లీటర్లు 98 కోట్ల లీటర్లు నీరు నిల్వ సామర్థ్యం గల చెరువును తవ్వడంతో పాటు రెండో రక్షిత మంచినీటి పథకానికి సంబంధించిన అన్ని పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. కుంచనపల్లిలో సెకండ్ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పనులకు కొట్టు సత్యనారాయణ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రెండో పంపులు చెరువు పనులు చేయడం జరుగుతుందన్నారు. అమృత్ పథకం తొలి విడతలో రూ.31.64 కోట్లు, రెండో విడతలో రూ.41.79 కోట్లు కలిపి మొత్తం రూ.73.4 3 కోట్ల రూపాయలు అంచనా వ్యయంతో రెండో రక్షిత మంచినీటి పథకం పనులు చేపడుతున్నామని తెలిపారు. టూ టౌన్ కు సంబంధించి మరో 112 కోట్ల రూపాయలు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు మంజూరయ్యాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్, సిజిఎఫ్ కమిటీ మెంబర్ కర్రి భాస్కరరావు, చెన్నా జనార్దన్ రావు పాల్గొన్నారు.

సమాజ మార్పునకు మార్క్స్ విశేషకృషి



కార్ల మార్క్స్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం

సమాజం మార్పునకు కార్ల మార్క్స్ విశేష కృషి చేశారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, సీనియర్ నేత జుత్తిగ నరసింహమూర్తి అన్నారు. స్థానిక మెంటేవారితోటలోని సుందరయ్య భవన వద్ద కారల్ మార్క్స్ వర్ధంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమాజ మార్పు కోసం, సమాజంలో జరుగుతున్న దోపిడీ నుంచి విముక్తి కోసం యావజ్జీవితాన్ని అంకితం చేసిన త్యాగమూర్తి కారల్ మార్క్స్ అన్నారు. మొదటి కమ్యూనిస్టు ప్రణాళికతో మొదలుపెట్టి తరువాత పెట్టుబడి దారి గ్రంధాన్ని రచించారన్నారు. కేవలం సిద్ధాంతాన్ని రూపొందించడమే కాకుండా ప్రత్యక్ష కార్యాచరణ రూపొందించి జర్మనీ, ఫ్రాన్స్, లండన్ వివిధ దేశాల్లో అక్కడ జరిగే కార్మికోద్యమంలో పాల్గొని కార్మిక విముక్తి కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి కారల్ మార్క్స్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.వైకుంఠరావు, గొర్ల రామకృష్ణ, జక్కంశెట్టి సత్యనారాయణ, కార్యకర్తలు ఇంజేటి శ్రీను, త్రిమూర్తులు, ఒడుగు వెంకటేశ్వరరావు, గంటి శ్రీను, చెల్లబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి

ఎంఇఒ - 2 గాదిరాజు కనకరాజు



ప్రజాశక్తి - కాళ్ల

పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు ఒత్తిడి, మానసిక ఆందోళన చెందొద్దని కాళ్ల ఎంఇఒ-2 గాదిరాజు కనకరాజు గురువారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ముందుగా ప్రణాళిక ప్రకారం చదువుకున్న పాఠ్యాంశాలను ఒకటికి రెండుసార్లు రివిజన్ చేసుకోవడం మంచిదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ఇప్పటికే అన్ని పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. ఇక విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయడమే తరువాయన్నారు. ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకూ జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామన్నారు. కాళ్ల పరీక్షా కేంద్రంలో 245 మంది రెగ్యులర్, 95 మంది ప్రయివేటు విద్యార్థులు, ఏలూరుపాడు పరీక్షా కేంద్రంలో 174 మంది రెగ్యులర్, 49 మంది ప్రయివేటు, కోపల్లె పరీక్షా కేంద్రంలో 205 మంది రెగ్యులర్, 110 మంది ప్రయివేటు విద్యార్థులు, కలవపూడి పరీక్షా కేంద్రంలో 118 మంది రెగ్యులర్, 40 మంది ప్రయివేటు విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ [illegible] జరుగుతుందన్నారు. విద్యార్థులు పరీక్షకు సకాలంలో హాజరు కావాలన్నారు. కొన్ని కారణాల రీత్యా ఆలస్యంగా వస్తే 10 గంటల వరకూ అనుమతించేందుకు అవకాశం ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. హాల్ టికెట్, పెన్ ప్రతి విద్యార్థీ వెంట తెచ్చుకోవాలన్నారు.

రొయ్యల ధరల తగ్గింపుపై 18లోపు వివరణ ఇవ్వాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

గోదావరి జిల్లాల్లో ఆక్వా రైతులకు, ప్లాంట్ యజమానులకు మధ్య కుదిరిన ఒప్పందానికి విరుద్ధంగా కిలోకు రూ.50 తగ్గించి రొయ్యలు కొనుగోలు చేస్తున్నారని జై భారత్ ఆక్వా రైతు సంఘం ఆరోపించింది. స్థానిక ఎస్-ఎస్ఎస్ కళ్యాణ మండపంలో గురువారం జరిగిన ఆక్వా రైతు సంఘ సమావేశంలో ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు మాట్లాడారు. రొయ్యల ధరలు తగ్గించిన విషయాన్ని సంఘానికి ఎందుకు చెప్పలేదని, ఈనెల 18వ తేదీలోపు వివరణ ఇవ్వాలని తెలిపారు. వివరణ సంతృప్తిగా లేకపోతే ఈ నెల 23న భీమవరంలో 25 వేల మంది రైతులతో సమావేశం నిర్వహించి కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు. గోదావరి జిల్లాల్లో రొయ్యల రైతులు తగ్గుతున్న ధరలకు రోజు రోజుకూ కుదేలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఆందోళన బాట పట్టగా ప్లాంట్ యజమానులు ముందుకొచ్చి తమను సంప్రదించినట్లు చెప్పారు. మేత, సీడ్, ధరలు పెరుగుతున్నా రొయ్య ధరలు దారుణంగా పడిపోతున్నాయని, ప్లాంట్ యజమానులు సిండికేట్‌గా కొనుగోలు చేయడమే దీనికి కారణమని తెలిపారు. ప్లాంట్ యాజమానులు సిండికేట్‌గా వ్యవహరిస్తున్నారన్నారు. సమావేశంలో రొయ్య రైతు ప్రతినిధులు రుద్రరాజు సత్యనారాయణ రాజు, కోడి విజయ భాస్కర్, రైతు సంఘం నేత రూప్ కుమార్ రాజు, కాకర్ల వినాయక్, జయరాం, టి.వెంకటరాజు, యువరాజు, గొట్టుముక్కల సూర్య నారాయణరాజు పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం : ముదునూరి

ప్రజాశక్తి - నరసాపురం

రాష్ట్రం ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పెదమైనవానిలంకలో గురువారం రెండో విడత నాడు-నేడు నిధులు రూ.1.20 కోట్లతో నిర్మించిన జిల్లా పరిషత్ హైస్కూల్ అదనపు తరగతి గదులు, రూ.30 లక్షలు ఎంజి ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో నిర్మించిన వివిధ సిమ్మెంటు రహదారులును ప్రారంభించారు. అలాగే రూ.30 లక్షలతో నిర్మించే సిమెంట్ రహదారికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పెదమైనవానిలంక జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఈ గ్రామంలో పూర్వం నుండి ఉన్న హైస్కూల్‌ను పునర్నించినట్లు తెలిపారు. నరసాపురం నియోజకవర్గంలో ఉన్నత పాఠశాలలు, ఎలిమెంటరీ స్కూలుకు పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేసి అభివృద్ధి చేసినట్లు తెలిపారు. పెదమైనవానిలంక హైస్కూలు చుట్టూ కాంపౌండ్‌తో సహా సుందరంగా తయారు చేసే అన్ని మౌలిక సదుపాయాలూ కల్పిస్తామన్నారు. గ్రామంలో రూ.9 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ తిరుమని నాగరాజు, జెడ్‌పిటిసి బొక్కా రాధాకృష్ణ, వైస్ ఎంపిపి ఉంగరాల రమేష్ నాయుడు, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు అంద్రాజు చల్లారావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు పివిఎల్ ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - ఉండి

ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉండి మండలంలో ప్రభుత్వ అభివద్ధి పనుల ప్రారంభోత్సవాలు ఊపందుకున్నాయి. సుమారు రూ.43.60 లక్షలతో సుమారు నాలుగు సంవత్సరాల నుంచి నిర్మాణంలో ఉన్న ఉండి సచివాలయ భవన పనులను ఇటీవల వేగవంతం చేసి గురువారం డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయించారు. ఉండి కాపులపేటలో ఇటీవల శంకుస్థాపన చేసిన 60 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన సుమారు రూ.32 లక్షల 45 వేలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్ ప్రారంభోత్సవంలో పివిఎల్ నరసింహరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్నారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా కాపులపేటలో ఓవర్ హెడ్ ట్యాంక్‌ను నిర్మించినట్లు తెలిపారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ అవసరమైన అభివృద్ధి పనులను కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రుణం తీర్చుకునేందుకు ప్రతి ఒక్కరూ వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఉప సర్పంచి గొట్టుముక్కల కళ్యాణ్ వర్మ, ఎంపిపి శ్రీహరి నారాయణరాజు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు పాల్గొన్నారు.

కాళ్ల : కలవపూడి నుండి మోడీ గ్రామం వరకూ రూ.20 లక్షలతో చేపట్టనున్న (ఆర్అండ్‌బి) ప్రధాన రహదారి మరమ్మతు పనులకు డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పాటించి రహదారి మరమ్మతులు త్వరగా పూర్తి చేస్తామన్నారు. అనంతరం పల్లిపాలెంలో 29 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

తోలేరు మాజీ సర్పంచి గోవిందరావు మృతి

ప్రజాశక్తి - వీరవాసరం

తోలేరు మాజీ సర్పంచి భోగిరెడ్డి గోవిందరావు (68) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. కొద్ది రోజులుగా ఆయన అనారోగ్యం కారణంగా ఆయన రాజమండ్రిలోని ప్రయివేటు ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నారు. ఆయన తోలేరు సర్పంచిగా, ఎంపిటిసిగా, నీటి సంఘం అధ్యక్షుడుగా పని చేశారు. ఆయనకు భార్య, వివాహితులైన కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి తోలేరు ఉపసర్పంచి భోగిరెడ్డి శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, టిడిపి నాయకులు వీరవల్లి చంద్రశేఖర్, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ సంతాపం తెలిపారు.

ఆక్రమణల తొలగింపు

ఉండి: ఆక్రమణలకు గురైన శ్మశానవాటిక దారిని అధికారులు గురువారం తొలగించారు. దీనికి సంబంధించి అధికారులు అందించిన వివరాల ప్రకారం.వాంద్రంలంకలోని దళితులకు చెందిన శ్మశానవాటిక దారిని కొంతమంది ఆక్రమించి రహదారి వేసుకుంటున్నారని బుధవారం రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ దృష్టికి ఆ ప్రాంతానికి చెందిన దళిత నాయకులు తీసుకెళ్లారు. దీంతో విక్టర్ ప్రసాద్ ఆ ప్రాంతాన్ని పరిశీలించి ఆక్రమణలను తొలగించి శ్మాశానవాటిక చుట్టూ కంచె వేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో అధికారులు ఆక్రమణలను తొలగించి, రహదారిని శుభ్రం చేయించి దళితులకు అప్పగించారు.

ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి

తాడేపల్లిగూడెం: పదో తరగతి విద్యార్థులు ఒత్తిడిని జయించి ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షల్లో పాల్గొంటే నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించవచ్చని మండల విద్యాశాఖ అధికారి విఎంకె.జ్యోతి అన్నారు. గురువారం పెదతాడేపల్లిలోని బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ ప్రిన్సిపల్ రాజారావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఇఒ జ్యోతి మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉన్నత ఉద్యోగ అవకాశాలు సాధించవచ్చని అన్నారు. పరీక్ష అనంతరం పేపర్‌ను రివిజన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రతాప్, జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, ఉపాధ్యాయులు లంకా రాజు, విజయరాజు, వెంకటేశ్వరరావు, స్కూల్ పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ కత్తుల రవిజైన్.తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది. విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటును స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సిఐ కె.మంగాదేవి కోరారు. పట్టణంలో కేంద్ర బలగాలతో కలిపి, స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు

నా బలం కార్యకర్తలే : ముదునూరి

ప్రజాశక్తి - నరసాపురం

కార్యకర్తలే నా బలం.. కొండంత అండ అని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చీఫ్ ముదునూరి ప్రసాద్‌రాజు మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉంటానని తెలిపారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో అందరికీ న్యాయం చేశామన్నారు. పులివెందుల తర్వాత అత్యధిక నిధులు నరసాపురానికి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తనయుడు ముదునూరి శ్రీకృష్ణంరాజును కార్యకర్తలకు పరిచయం చేశారు. ఎన్నికల ప్రచారంలో తన కొడుకు కూడా పాల్గొంటారన్నారు. నర్సాపురం పార్లమెంట్ ఇన్‌ఛార్జి గూడూరి ఉమాబాల మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో కార్యకర్తలంతా సమిష్టిగా కృషి చేసి ప్రసాదరాజును గెలిపించాలన్నారు.

చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తా

మాజీ ఎంఎల్ఎ మాధవనాయుడు

ప్రజాశక్తి - మొగల్తూరు

తన శ్రేయోభిలాషులతో చర్చించి తన భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు అన్నారు. విజయవాడ నుంచి తిరిగొస్తున్న ఆయనకు అభిమానులు, కార్యకర్తలు నాగిడిపాలెంలో కలిసి మేమున్నామంటూ సుమారు 50 కార్లలో ర్యాలీగా వెళ్లి స్వాగతం పలికారు. గురువారం ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లుగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నానన్నారు. అనేక ప్రజా సమస్యలపై పోరాడమన్నారు. ప్రజల పక్షాన పోరాడితే తనపై 18 కేసులు పెట్టారని నాన్ బేల బుల్ కేసులు సైతం పెట్టి ఇబ్బందులు పెట్టారన్నారు. అనంతరం ప్రదర్శనగా నరసాపురం బయలుదేరి వెళ్లారు.

వైసిపివి కుట్ర రాజకీయాలు : పితాని

ఆచంట: ఏపిలో సార్వత్రిక ఎన్నికల సమీపిస్తుండగా అధికార పార్టీ వైసిపి కుయుత్తులకు పాల్పడుతోందని, వాలంటీర్లతో ప్రజలను మభ్యే పెట్టేందుకు మరో కుట్రకు తెర లేపారని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ విమర్శించారు. వల్లూరులో ఇంటింటి పాదయాత్ర చేపట్టి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస జ్ఞానం లేని ముఖ్యమంత్రి జగన్, ఎంఎల్ఎ రంగనాథరాజు ప్రజా ప్రతినిధులుగా ప్రజాస్వామ్యానికి పనికిరారని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి పాల్గొన్నారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ఆచంట

జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆచంట గ్రామంలో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జనసేన జెండాను ఆచంట ఎంపిటిసి దాసిరెడ్డి పుణ్యవతి ఆవిష్కరించారు. అనంతరం వికలాంగులకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు పార్టీ గ్రామ అధ్యక్షులు నంబూరి విజయ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన వల్లూరు గ్రామానికి చెందిన రుద్ర నాగమణికంఠకు జనసేన తరపున సభ్యత్వ ఇన్సూరెన్స్ కింద రూ.41,500 చెక్కును మండల అధ్యక్షులు జవ్వాది బాలాజీ శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యురాలు షేక్ పాషా మునిసా, నాయకులు నిమ్మన వీర శేఖర్, కడలి శ్రీను, లక్ష్మణ్, శ్రీను పాల్గొన్నారు.

పోడూరు : జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జనసేన మండల అధ్యక్షులు రావి హరీష్ బాబు ఆధ్వర్యంలో [illegible] జనసైనికులు చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ముందుగా జనసేన నాయకులుచ దాత కొప్పినీడి శ్రీను చలివేంద్రాన్ని ప్రారంభించారు.

నరసాపురం : జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయంలో జనసేన జెండాను నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ ఆవిష్కరించి మాట్లాడారు. పవన్ కళ్యాణ్ ప్రజానాయకుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో జక్కం బాబ్జి, కోటిపల్లి వెంకటేశ్వరరావు, ఘంటా కృష్ణ పాల్గొన్నారు

మహిళా సాధికారతే లక్ష్యం : చెరుకువాడ

ప్రజాశక్తి - ఆచంట

మహిళా సాధికారతే లక్ష్యంగా ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని ఎంఎల్ఎ రంగనాథరాజు అన్నారు. గురువారం కొడమంచిలి, పెదమల్లం గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టడం, మోసగించడంలో చంద్రబాబు నేర్పరి అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌తో పోటీ పడలేని ఆయన పొత్తుల కోసం పాకులాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో 35 లక్షల మంది మహిళలకు అన్ని హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ చేసి ఇళ్ల పట్టాలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్, సర్పంచులు పాల్గొన్నారు.

ముత్యాలపల్లిలో అన్నదానం

మొగల్తూరు: ముత్యాలపల్లిలోని భువనేశ్వరి సమేత ముక్తేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం అన్న సమరాధన చేశారు. ఇటీవల మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేశారు.

కొనసాగిన ఇంటర్ పరీక్షలు

నరసాపురం: ఇంటర్ ప్రథమ సంవత్సర కెమిస్ట్రీ-1, కామర్స్ -1 పరీక్షలు గురువారం జరిగాయి. నరసాపురంలో ఆదిత్య, వైన్ డైమండ్ జూబ్లీ, శ్రీసూర్య, ఉమెన్స్, గౌతమి, భాస్కరా కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు ఉండడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. బిజిబిఎస్ ఉమెన్స్ కళాశాలలో 302 విద్యార్థులకు గాను 282 మంది పరీక్షలకు హాజరయ్యారు. 20 మంది గైర్హాజరయ్యారు.

వైసిపి ఆధ్వర్యాన బైక్ ర్యాలీ

గణపవరం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి విజయం సాధిస్తుందంటూ గురువారం మండలంలోని మొయ్యేరు నుండి ఉంగుటూరు మండలం గొల్లగూడెం వరకూ భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్ఆర్ పార్టీ ఘన విజయం సాధిస్తుందన్నారు. ర్యాలీలో ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, తిరుమల దేవస్థానం కమిటీ సభ్యులు గాదిరాజు వెంకటసుబ్బరాజు (పెదబాబు), దెందులూరు ఎంఎల్ఎ అబ్బయ్య చౌదరి, నేతలు పాల్గొన్నారు.

16న లోక్ అదాలత్

తణుకురూరల్: ఈ నెల 16వ తేది శనివారం తణుకు కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, నాలుగో అదనపు జిల్లా జడ్జి డి సత్యవతి తెలియజేశారు. గురువారం స్థానిక కోర్టు ఆవరణలో పోలీస్ వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకుని కేసుల నుండి విముక్తులు కావాలని తెలియజేశారు. ఎక్కువ కేసులు రాజీ పడే విధంగా పోలీసులు సహకరించాలని తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సమావేశంలో ఎఎస్ఐ కృష్ణమూర్తి, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.